# జీవించిన గంట

కేట్ చోపిన్

అనువాదం: గంగారెడ్డి



**అనువాదం:** జీవించిన గంట

**మూల రచన:** కేట్ చోపిన్

**అనువాదకుడు:** గంగారెడ్డి

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: జులై 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3080

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# జీవించిన గంట

మిసెస్ లూసీ మల్లార్డ్‌కి గుండెజబ్బు ఉందని ముందే తెలుసు కాబట్టి, ఆమె భర్త చనిపోయాడన్న వార్తని వీలైనంత సున్నితంగా తెలియజేయటానికి జాగ్రత్తపడ్డారు అందరూ.

ఆమెకు ఈ వార్తను ఆమె అక్క జోసెఫీన్ సగంసగం వాక్యాల్లో, అరకొర సూచనల్తో చెప్పింది. ఆమె భర్తకు స్నేహితుడైన రిచర్డ్ కూడా అక్కడే ఉన్నాడు. అతను పొద్దున్న న్యూస్‌పేపరు ఆఫీసులో ఉన్నప్పుడే రైలు ప్రమాదం తాలూకు వార్త అందింది, ఆ మృతుల జాబితాలో మొదట ఉన్నది బ్రెంట్లీ మల్లార్డ్ పేరే. ఆ వార్తని మరో టెలిగ్రాంతో ఖాయపర్చుకునేంతవరకూ మాత్రమే రిచర్డ్ అక్కడ ఆగాడు. అది అందగానే, ఈలోగా తనంత జాగ్రత్తా అక్కరా లేని మరెవరైనా స్నేహితుని ద్వారా ఈ దుర్వార్త ఆమెకు చేరకుండా నివారించేందుకు, ఉరుకులుపరుగుల మీద బయల్దేరాడు.

మామూలుగా ఇలాంటి వార్త విన్న చాలామంది స్త్రీలలాగా ఆమె దాని అర్థాన్ని అంగీకరించలేనట్టు చేష్టలుడిగిపోలేదు. వెంటనే విహ్వలంగా ఏడుస్తూ తన అక్క చేతుల్లో వాలిపోయింది. శోకపు తుఫాను సద్దుమణిగాక, అలాగే లేచి ఒంటరిగా తన గదిలోకి నడుచుకుపోయింది. వెంట ఎవర్నీ రానివ్వలేదు.

లోపల తెరిచిన కిటికీ ముందు ఒక సౌకర్యవంతమైన కుర్చీ వేసి ఉంది. తన శరీరాన్ని ఆవహించిన అసలట ఆత్మలోకి కూడా చొచ్చుకుపోతున్నట్టు బరువుగా అనిపించి కుర్చీలో వాలిపోయింది.

కిటికీలోంచి చెట్ల చిటారుకొమ్మలు వసంతపు చిగుర్లతో అల్లల్లాడుతూ ఆమె కంటపడ్డాయి. రుచికరమైన వర్షపు వాసనేదో గాలిలో మసలుకుంటోంది. కింద వీధిలో చిల్లరవ్యాపారి తోపుడుబండి మీద సరుకుల్ని బిగ్గరగా అమ్ముకుంటున్నాడు. దూరాన ఎవరో పాడుతున్న పాట వినీవినపడనట్టు ఆమె చెవుల్ని తాకుతోంది. చూరు దూలాల్లో గూడుకట్టిన పిచ్చుకలు ఉండుండి కిచకిచమంటున్నాయి.

కిటికీ ఎదురుగా పశ్చిమదిక్కున మేఘాలు ఒకదాన్నొకటి కలుస్తూ, ఒకదానిపై ఒకటి పేరుకుంటున్నాయి. వాటి మధ్య ఖాళీల్లోంచి ఆకాశం అతినీలంగా కనిపిస్తోంది.

ఆమె కుర్చీ మెత్త మీద తల వేలాడేసి కదలకుండా కూర్చుంది, అప్పుడప్పుడూ మాత్రం వెక్కుతోంది, ఏడ్చి ఏడ్చి నిదరపోయి కలల్లో కూడా వెక్కే పసివాడి లాగా.

ఆమె వయసు తక్కువే, మంచి ఛాయతో ప్రశాంతంగా కనిపించే ముఖమామెది, ఆ ముఖం మీది రేఖలు నిగ్రహాన్నీ, ఒకలాంటి స్థైర్యాన్నీ కూడా సూచిస్తాయి. కానీ ఇప్పుడు మాత్రం ఆమె కళ్లు మందకొడిగా ఉన్నాయి, దూరాన మేఘాల మధ్య ఆకాశాన్ని చూస్తున్నాయి. కానీ ఆ చూపు ఆలోచించటాన్ని కాదు, ఆలోచనలు స్తంభించిపోవటాన్ని సూచించేది.

ఆమె వైపు ఏదో వస్తోంది, ఆమె దాని కోసం ఎదురుచూస్తోంది, భయపడుతూనే. ఏమిటది? ఆమెకి తెలియదు; ఇదని పేరుపెట్టేందుకు అందనిది. కానీ అది ఆకాశంలోంచి మొదలై, గాలిలో ఆవరించి ఉన్న పరిమళాలూ సవ్వడులూ రంగుల గూండా, ఆమె వైపు రావటం ఆమెకు తెలుస్తోంది.

ఇప్పుడు ఆమె గుండెలు కలవరంగా ఎగసిపడుతున్నాయి. తనను ఆవహించబోతున్నదేమిటో ఆమె క్రమేణా గుర్తించగలుగుతోంది, ఆమె తన సంకల్పబలంతో దాన్ని వెనక్కి తరిమేందుకు ప్రయత్నిస్తోంది -- ఆమె తెల్లని సన్నని చేతుల్లో ఆ చేవ లేకపోయినా. ఇక ఆమె వల్లగాక పట్టుసడలగానే, చిన్నగా తెరుచుకున్న ఆమె పెదాల మధ్య నుంచి ఒక పదం బయటపడింది. ఆమె ఆ పదాన్ని తన ఊపిరి కన్నా సన్నగా పదే పదే గొణిగింది: “విముక్తి, విముక్తి, విముక్తి!” అంతకుముందున్న మందకొడితనమూ, ఆ తర్వాత ఆక్రమించిన భీతీ క్రమంగా ఆమె కళ్లను వీడి వెళ్లిపోయాయి. ఇప్పుడా కళ్ళు సూటిగా వెలుగుతున్నాయి. ఆమె నాడి వేగంగా కొట్టుకుంది, ప్రవహిస్తున్న రక్తం ఆమె దేహంలో ప్రతీ అంగుళాన్ని వెచ్చబరిచి నిమ్మళింపజేసింది.

తనను పట్టిఊపుతున్నది రాక్షసానందమేమో అన్న ప్రశ్న ఆమెకు రాలేదు. ఒక స్పష్టమైన ఉన్నతమైన దృష్టి ఆ సంశయాన్ని పనికిరానిదిగా కొట్టిపడేసింది. ఆమెకు తెలుసు తాను మరలా ఏడుస్తానని, ఆ మృదువైన దయగల చేతులు నిర్జీవంగా ఛాతీమీద విశ్రమించి కనపడినప్పుడూ; తనను ఎప్పుడూ ప్రేమగా తప్ప మరోలా చూడని ఆ ముఖం జడంగా పాలిపోయి చచ్చిపోయి కనపడినప్పుడూ... తాను మరలా ఏడుస్తుంది. కానీ ఆ శోక క్షణాలకు ఆవలగా ఇక అచ్చంగా తనకు మాత్రమే చెందిన సంవత్సరాలెన్నో బారులు తీరి కనపడుతున్నాయి. వాటిని స్వాగతిస్తూ ఆమె తన చేతుల్ని విశాలంగా బారజాచింది.

ఆ రాబోయే సంవత్సరాల్లో తాను ఇంకెవరి కోసమూ బతకనక్కర్లేదు; తనకోసమే బతుకుతుంది. తమకే పరిమితమైన ఇష్టాయిష్టాల్ని తోటి మనిషిపై రుద్దే హక్కు తమకుందని భావిస్తారు స్త్రీ పురుషులు. అలాంటి గుడ్డిమొండితనమేదీ ఇక తన ఇష్టాయిష్టాల్ని అణచబోదు. దాని వెనుక ఉద్దేశం దయగలదైనా క్రూరమైనదైనా అదేమీ దాని దోషాన్ని తక్కువచేయదని ఆమె ఈ క్లుప్త ప్రకాశక్షణాల్లో గ్రహించింది.

అయినా అతడ్ని ఆమె ప్రేమించింది, కొన్నిసార్లు. ప్రేమించలేదు, చాలాసార్లు. ఇప్పుడీ లెక్కల్తో ఒరిగేదేముంది! తాను తనకే చెందటమనే ఈ భావనతో పోలిస్తే, అర్థంకాని చిక్కుప్రశ్నలాంటి ఆ మాయదారి ప్రేమ విలువ ఏపాటిది! ఈ స్వాధీనభావం తన అస్తిత్వపు అత్యంత బలమైన వాంఛ అని ఆమె అప్పటికప్పుడు గ్రహించింది.

"విముక్తి! శరీరానికీ మనసుకూ విముక్తి!" అని గొణుక్కుంటోంది.

ఇంతలో జోసెఫీన్ తలుపు బయట వంగి నోటిని తాళపుకన్నం దగ్గర పెట్టి తనను లోనికి రానివ్వమని బతిమాలుతోంది. "లూసీ తలుపు తీయి! మా అమ్మ కదూ; తలుపు తీయి-- నువ్విలాగే ఉంటే ఆరోగ్యం పాడు చేసుకుంటావు. ఏం చేస్తున్నావు లూసీ? దయచేసి తలుపు తీయి."

"వెళ్లిక్కణ్ణించి. నేనేం ఆరోగ్యం పాడు చేసుకోవటం లేదు." నయం; సాక్షాత్తూ జీవనామృతాన్నే తాగుతుంటే, ఈ తెరిచిన కిటికీ నుంచి!

ఆమె ఊహలు ముందున్న రోజుల్లోకి కేరింతలుకొడుతూ పరిగెడుతున్నాయి. వసంతపు రోజులు, వేసవి రోజులు, అన్ని రకాల రోజులూ ఇక ఆమె సొంతం. జీవితం చిరాయువు కావాలని చిన్నగా ప్రార్థించింది. నిన్నటికి నిన్న చిరాయువుగా జీవించటమన్న ఊహకే వణికిన ఆమె!

అక్క అదేపనిగా బతిమాలిన మీదట ఆమె తాపీగా లేచి తలుపు తీసింది. ఆమె కళ్లు విజయసంభ్రమంతో మెరుస్తున్నాయి, తనకు తెలియకుండానే విజయదేవతకు మల్లే నడుస్తోంది. నడుస్తూ వచ్చి అక్క నడుం చుట్టూ చేయి వేసింది, ఇద్దరూ కలిసి మెట్లు దిగుతున్నారు. రిచర్డ్సు మెట్ల కింద ఎదురుచూస్తున్నాడు.

ఈలోగా ముందుగుమ్మం తలుపుని ఎవరో బయట నుంచి తెరుస్తున్న చప్పుడు వినిపించింది. బ్రెంట్లీ మల్లార్డ్ లోపలికి వచ్చాడు; ప్రయాణపు అలసటతో, తన సూట్‌కేసును హుందాగా పట్టుకుని, చంకలో గొడుగు పెట్టుకుని. అతను ప్రమాదస్థలానికి చాలా దూరంలో

ఉన్నాడు, అసలు ప్రమాదం జరిగిందన్న సంగతే అతనికి తెలియదు. రాగానే అందిన స్వాగతం చూసి అతను ఆశ్చర్యపోయాడు, జోసెఫీన్ కెవ్వున అరిచింది, రిచర్డు ఒక్క ఉదుటున ముందుకు కదిలాడు, ఆ కదలటంలో తన భార్య కనుమరుగైంది.

డాక్టర్లు వచ్చాకా ఆమె చావుకి కారణం గుండెపోటని తేల్చారు -- ఆనందం తట్టుకోలేక వచ్చిన గుండెపోటని.

★

For Latest Telugu Books - Visit now:
Kinige
.com